క్లుప్తంగా

రామతీర్థంలో ప్రత్యేక పూజలు



వెండి మంటపంలో సీతారామస్వామికి పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో విశేష హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి వెండి మంటపం వద్ద సీతారాముల నిత్య కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రామతీర్థం దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో శనివారం విచ్చేసి స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు.

ఆర్‌జీఎస్‌ఏ ప్రణాళికపై ముగిసిన శిక్షణ



ఆర్‌జీఎస్‌ఏ శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో, సర్పంచ్‌లు, సిబ్బంది

భోగాపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) ప్రణాళికపై సచివాయ, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లకు ఎంవోటీల ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో స్వరూపరాణి మాట్లాడుతూ ఎంవోటీలు ఇచ్చిన శిక్షణను సచివాలయ, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌లు సద్వినియోగం చేసుకుని పంచాయతీలకు ఆదాయం వచ్చేలా ఆర్థిక వనరులు సమకూర్చుకుని పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం సిబ్బందితో కలిసి కేంద్ర ప్రభుత్వం సవరించిన జీఎస్టీ శ్లాబులపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు.

బాలసదన్ హోమ్ ఆకస్మిక తనిఖీ



స్టోర్ రూమును పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్

విజయనగరం లీగల్: జిల్లా కేంద్రంలోని బాలసదన్‌ను జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలసదన్‌లోని గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు. సందర్శన సమయంలో సదన్‌లో 8 మంది పిల్లలు ఉన్నట్టు గుర్తించారు. పిల్లలకు అందుతున్న మెనూ గురించి వాకబు చేశారు. కొంతసేపు అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం స్టోర్ రూములో ఉన్న బియ్యం, పప్పు దినుసులను పరిశీలించి వాటిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికి హోటల్స్ అసోసియేషన్ శనివారం సారెను సమర్పించింది. జిల్లా అధ్యక్షుడు పిఎస్ఎస్.వాసు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు అసోసియేషన్ సభ్యులు, కుటుంబ సభ్యులతో కలిసి వివిధ రకాల పిండి వంటలు, పసుపు, కుంకుమ, పండ్లతో ఊరేగింపుగా వచ్చారు. అనంతరం వారంతా అమ్మవారికి సారెను సమర్పించారు. అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సునీల్‌కుమార్, కోశాధికారి జి.కృష్ణ చైతన్య సభ్యులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించిన దుండగులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గరివిడిలో ఆ సంఘ అధ్యక్షుడు టొంపల సంజీవరావు, ఉపాధ్యక్షుడు బూర సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బోడసింగి పోలీస్ శనివారం మాట్లాడారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు నిప్పంటించడం సిగ్గుచేటన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా మాలమహానాడు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టంచేశారు.

సిరి సారథులు

- పైడితల్లి సిరిమాను సేవలో తరిస్తున్న వడ్రంగులు
- సిరిమానుగా మలిచి.. ఉత్సవానికి సిద్ధం చేయడంలో కీలక పాత్ర
- 42 ఏళ్లుగా వారి కుటుంబీకులే స్వచ్ఛంద సేవలందిస్తున్న వైనం
- అమ్మ సాక్షాత్కరించిన నాటి నుంచి ఉత్సవం పూర్తయ్యే వరకూ వారిదే బాధ్యత



సిరిమాను చెక్కుతున్న వడ్రంగులు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలను తీర్చే కల్పతరువు శ్రీపైడితల్లి అమ్మవారి దర్శనం అదృష్టం. సిరిమానోత్సవం ఓ అద్భుత అపురూప ఘట్టం. ఏళ్ల తరబడి నిర్విఘ్నంగా సాగుతున్న సిరిమానోత్సవంలో సిరిమానుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. సిరిమానును గుర్తించడం, తయారీలో ఎందరో వడ్రంగుల భాగస్వామ్యం ఉంటుంది. ఏ పనులున్నా... ఎక్కడునా ఏటా సిరిమానోత్సవానికల్లా వారంతా పట్టణానికి చేరుకుంటారు. భక్తిశ్రద్ధలతో సిరిమానును తయారుచేస్తారు. ఈ ఏడాది కూడా వీరి చేతుల్లో ఊపిరి పోసుకుంటున్న సిరిమాను, గిలక, పీటల తయారీ పూర్తి కావొచ్చింది.

అమ్మవారు చూపిన బాటలోనే..

సిరిమాను తయారీకి చింతమానునే ప్రధానంగా పైడితల్లి కోరుకుంటుంది. ఏటా అమ్మవారు పూజారి కలలో కనిపించి సిరిమానుకు దారి చూపించడం ఆనవాయితీ. ఆ దిశలో పూజారి, ఆలయ సిబ్బంది వెళ్లి అన్వేషిస్తారు. అమ్మవారి సిరిమానుగా సాక్షాత్కరించిన చింతమానును సిరిమానుగా నిర్ణయించి అమ్మవారికి పూజాధికాలను నిర్వహిస్తారు. సిరిమాను సాక్షాత్కరించిన గ్రామంలో పండగ వాతావరణం నెలకొంటుంది. పైడితల్లి తమ గ్రామానికి వచ్చిందని గ్రామస్తులు ఉప్పొంగిపోతారు. భాజాభజంత్రీలతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది గంట్యాడ మండలం కొండ తామరాపల్లి గ్రామంలో చల్లా, లోకవరపు వారి కళ్లాల్లో అమ్మ సాక్షాత్కరించింది. దానికి పూజలు నిర్వహించి హుకుంపేటలోని పూజారి ఇంటి వద్దకు తరలించారు. సిరిమాను తయారీలో కొన్ని కుటుంబాలకు చెందిన వడ్రంగులు ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. సిరిమాను బాధ్యతలను తలా పంచుకుంటారు. సిరిమాను, గిలకలు, పూజారి పీట, ఇరుసుమాను, రథాలను తయారుచేసి వాటికి రంగులు అద్దడంలో తలమునకలయ్యారు.

తాత, తండ్రుల నుంచి భాగస్వామ్యం



చిన్నప్పటి నుంచి మా నాన్నతో కలిసి సిరిమాను చెక్కడానికి వచ్చేవాడిని. ఎంతో పవిత్రమైన చింతమానును చెక్కుతుంటే చెప్పలేనంత ఆనందం కలిగేది. మా తాత తర్వాత నాన్న... ఇప్పుడు నేను సిరిమాను చెక్కుతున్నా. ఆ తల్లి దయతో నా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది.

– కనిమెళ్ల రమణ, పాతర్లపల్లి, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా

పనులు దాదాపు పూర్తి



ఎంతో కష్టపడి తల్లి కోసం చెక్కే సిరిమానుపై అమ్మవారు ఆశీనులై ఆకాశవీధిలో విహరిస్తూ దీవెనలందించడం మాకెంతో ఆనందం. ఒక్కొక్క రథం వెళ్తుంటే అప్పటి వరకూ పడిన కష్టమంతా మరిచిపోతాం. కష్టం మరచి, ఎంతో ఉత్సాహంగా పండగ చేసుకుంటాం. పనులు దాదాపు పూర్తయిపోయాయి.

– టేకు శంకరరావు, శ్రీకాకుళం

భక్తిప్రపత్తులతో తయారీ



సిరిమాను సహా గిలకలు, పూజారి కూర్చొనే పీటను తయారు చేస్తాం. పెద్ద పెద్ద తాళ్లతో కట్లు కడతాం. రోజూ స్నానపానాదులు పూర్తి చేసుకుని భక్తితో సిరిమానుకు మొక్కి బొట్లు పెట్టాకే పనులు ప్రారంభిస్తాం. సిరిమాను సిద్ధమైనట్లే. ఇరుసు మాను పనులు పూర్తి కావచ్చాయి.

–ఎస్.వెంకటేశ్వరరావు, సారిక

ఎన్ని పనులున్నా రావాల్సిందే..



అమ్మ సేవలో చిన్నప్పటి నుంచి తరిస్తున్నాను. ఏటా సిరిమాను పనులు ప్రారంభం నుంచి చివరి వరకూ అతి జాగ్రత్తతో పనులు చేయించుకుంటాను. ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూసుకోవాల్సిన కీలక బాధ్యత తీసుకున్నాను. ఎక్కడ ఉన్నా తల్లి పండగకు రావాల్సిందే. సిరిమాను పనులు చేయాల్సిందే. బంటుపల్లి బైరాగినాయుడు నుంచి సిరిమాను పనులు చేస్తూ వస్తున్నాను. చాలా ఆనందంగా ఉంది. గతంలో సిరిమాను అధిరోహించిన బైరాగినాయుడు, అన్నయ్య తాళ్లపూడి భాస్కరరావు, నేతేటి శ్రీనివాస్‌లతో పాటూ ప్రస్తుతం 8 ఏళ్లుగా సిరిమాను అధిరోహిస్తున్న బంటుపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో సిరిమాను, ఇరుసుమానులను తయారుచేయడం, ఉత్సవానికి సిద్ధం చేయడం ఆనందంగా ఉంది.

– తాళ్లపూడి సోమినాయుడు, ఉత్సవ రథసారధి, విజయనగరం

అందరి సమష్టి కృషి



పైడితల్లి జాతర నిర్వహణకు ఎంతో కష్టపడతాం. రాత్రనక, పగలనక పనుల్లో నిమగ్నమవుతాం. వడ్రంగుల సమష్టి కృషితోనే ఇది విజయవంతమవుతుంది. హుకుంపేటలో నెలరోజుల పండగ వాతావరణం ఉంటుంది. సిరిమాను తయారీలో భాగస్వామిని కావడం నా అదృష్టం.

– కె.సత్యం, దమరసింగి, గుర్ల

ఐక్యత – క్రమశిక్షణపై ప్రేరణాత్మక సదస్సు



సదస్సులోని యాక్టివేషన్ ప్రక్రియలో ఎన్‌సీసీ విద్యార్థులు

విజయనగరం అర్బన్: స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా ఐక్యత – క్రమశిక్షణ అనే అంశంపై స్ఫూర్తిదాయక సదస్సు శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యవక్తగా హాజరైన సీతం డైరెక్టర్, విద్యావేత్త, మోటివేషనల్ స్పీకర్ డా.మజ్జి శశిభూషణరావు సుమారు 600మంది ఎన్‌సీసీ క్యాడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. మేనేజిమెంట్ గేమ్స్, ప్రేరణాత్మక చర్చలతో క్యాడెట్లలో ఉత్సాహం నింపుతూ, క్రమశిక్షణను జీవిత విధానంగా స్వీకరించాలని, ఐక్యతనే అతి పెద్ద శక్తిగా భావించాలని పిలుపునిచ్చారు. అలాగే కారప్స్ అనే పదంలోని మౌనాక్షరాలు పీ, ఎస్ క్యాడెట్లలోని అజ్ఞాత బలం, క్రమశిక్షణకు ప్రతీకలని వివరించారు. శిబిర నిర్వాహకులు మాట్లాడుతూ ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థుల్లో దేశభక్తి, బాధ్యతా భావం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ థపస్ మండల్, సుబేదార్ అలేతి చంద్రరావు, ఏ సీసీ అధికారులు కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ ప్రసాంత్, లెఫ్టినెంట్ కృష్ణకిశోర్, సీఎస్‌వో సత్యనారాయణ, యూనిట్ అధికారులు, పలువురు క్యాడెట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై టీచర్ల నిరసన



పూసపాటిరేగ విద్యాశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పూసపాటిరేగ : ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యలు పరిష్కరించి విద్యా శాఖలో వున్న అసంబద్ధతను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 2004 సెప్టెంబరు 1వ తేదీ ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియామకమైన వారందరికి కేంద్ర ప్రభుత్వం మెమో నెంబరు 57 అమలు చేసి పాత పెన్షన్ విధానం అమలులోకి తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయిలకు బోధన తప్ప ఏ ఇతర కార్యక్రమాలు అప్పగించ వద్దు అని డిమాండ్ చేశారు. విద్యాశక్తి కార్యక్రమం ఐచ్ఛికం అని చెబుతూ బలవంతంగా అమలు చేయడాన్ని విడనాడాలన్నారు. 12వ పీఆర్సీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు షేక్ భుకారిబాబు, కెళ్ల గోవిందనాయుడు, కప్పల అప్పలరాజు, గంగాధర్, వైకుంఠరమణ, శ్రీనివాసరావు, ఫణీంద్రకుమార్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ

నెల్లిమర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. స్థానిక రామతీర్థం జంక్షన్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు నుంచి విముక్తి కలిగించాలని కోరారు. 12వ పీఆర్‌సీ ప్రకటించాలని కోరారు. మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వి.రమణ, పతివాడ త్రినాధ్, యు.శ్రీనివాసరావు, కె.బాలకృష్ణ, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నెల్లిమర్ల: ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అంబేడ్కర్ విగ్రహాన్ని దగ్ధం చేయడం అమానుషం

నెల్లిమర్ల రూరల్: చిత్తూరు జిల్లాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్రోల్ పోసి దగ్ధం చేయడం అమానుషమైన చర్య అని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య, ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సతివాడలో వారు శనివారం మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమాన పరిచిన రాజ్యాంగ వ్యతిరేక శక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి పాలనలో బాలికలకు, మహిళలకు రక్షణ కరువైందని, అల్లూరి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బాలికపై ఇటీవల జరిగిన అత్యాచారమే ఒక ఉదాహరణ అన్నారు. బాలికపై ఇద్దరు వ్యక్తులు నాలుగు రోజులగా అత్యాచారం చేశారని, గత నెల 13న చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఇటీవల జరిగిన వరుస ఘటనలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

20లోగా ఈ పంట నమోదు చేయాలి



డెంకాడలో ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ

డెంకాడ: ఈ-పంట నమోదు ఈ నెల 20లోగా పూర్తి చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు విజయనగరం ఏడీఏ ఎ.నాగభూషణం ఆదేశించారు. మండలంలోని డెంకాడ గ్రామంలో ఈ-పంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ నాగభూషణం మాట్లాడుతూ మండలంలో 5213 ఎకరాల్లో పంట విస్తీర్ణం ఉందన్నారు. ఇప్పటి వరకూ 3717 ఎకరాల్లో ఈ-పంట నమోదు జరిగిందన్నారు. ఇంకా 1496 ఎకరాల్లో పంట నమోదు చేయాల్సి ఉందన్నారు. అందువలన గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు పంట నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ-పంట నమోదు వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఏవో సంగీత, ఏఈవో రామకోటి, వ్యవసాయ సహాయకులు అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఊరేగింపు

పూసపాటిరేగ : పూసపాటిరేగలో దుర్గాదేవి ఊరేగింపు శనివారం ఘనంగా జరిగింది. జాతీ య రహదారి, రాజావీధి, భూడివీధి, సాలిపేట మీదుగా ఊరేగింపు సాగింది. దారి పొడువునా సాంస్కృతిక కార్యక్రమాలు చేయడంతో ప్రజలను ఆకట్టుకున్నాయి. మాజీ ఎంపీటీసీ సభ్యుడు మురపాల బోగేష్, పి.అప్పలనాయుడు, కె.రమేష్, పి.ప్రసాద్ పిట్ట శ్రీనుతో పాటు యువత ఊరేగింపులో పాల్గొన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్సు ప్రాంతంలో ట్రాఫిక్‌జామ్

● ట్రాఫిక్ జామ్



మయూరి జంక్షన్‌లో జోరువాన

విజయనగరం జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. వర్షం కురుస్తున్న సమయంలో ప్రయాణికుల కోసం ఆటోవాలాలు రోడ్డుపైనే వాటిని నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఓ వైపు వర్షం.. మరోవైపు ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

కోలగట్లకు అభినందనల వెల్లువ



వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులుగా నియామకమైన కోలగట్ల వీరభద్రస్వామిని అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ (సీఈసీ)గా నూతనంగా నియామకమైన ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి అభినందనలు వెల్లువెత్తాయి.

విజయనగరం కార్పొరేషన్ మేయర్ వేంపడాపు విజయలక్ష్మి, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేష్, నగర పార్టీ అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారు నాయుడులతో పాటు పలు డివిజన్‌లకు చెందిన కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు ఆయనను శనివారం కలిసి అభినందించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కోలగట్ల సేవలు గుర్తించి కీలక పదవిని అప్పగించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

అలరించిన నృత్య ప్రదర్శన



చదురు గుడి వద్ద నృత్య ప్రదర్శన ఇచ్చిన వరలక్ష్మి నాట్యాలయం విద్యార్థులు

విజయనగరం టౌన్: విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం, శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవాలలో భాగంగా శనివారం చదురు గుడి వద్ద వరలక్ష్మీ నాట్యాలయం కళాకారిణులు నత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గురువు పేరి వరలక్ష్మి శిక్షణలో ఉన్న బాబామెట్ట వరలక్ష్మి నాట్యాలయం విద్యార్థినులు ప్రదర్శన ఇచ్చారు. సాంప్రదాయ నృత్యరీతులతో అమ్మవారి ఉత్సవాల శోభను ఇనుమడింపజేస్తూ, చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రదర్శన ఇచ్చిన విద్యార్థినులలో లలిత, శ్రీనిజ, మౌనిక, నిఖిత, సాహిత్య, దివ్య, యశ్రీత, రోషిక, కుందన, లౌక్య, లోచన, సిరి చందన, వినయ, శ్యామ, మౌన్యవి, సాయి వెన్నెల, మనశ్వసీ ఉన్నారు.

ఉత్సవాల్లో అంకితభావంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నల్లనయ్య

- కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: విజయనగర ఉత్సవం, పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యతిస్తూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని ప్రజారోగ్య సిబ్బందికి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పండగ రోజుల్లో 3 షిఫ్టులు వారీగా సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ఎక్కడా ఎటువంటి చెత్తాచెదారాలు లేకుండా అనునిత్యం పారిశుధ్యంపైనే దృష్టి సారించాలన్నారు. సిరిమానోత్సవం తరువాత కూడా రహదారులన్నీ పరిశుభ్రంగా ఉండేటట్టు చూడాలన్నారు. 12 ప్రాంతాలలో 60 బయో టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆయా టాయిలెట్ల పరిశుభ్రతను కూడా పర్యవేక్షించాలన్నారు. నిరంతరాయంగా సేవలను అందించి ప్రజా మన్ననలను పొందాలని చెప్పారు. సిబ్బందికి సెలవులు మంజూరు చేసే అవకాశం లేదన్నారు. అందరి సమన్వయంతో జాతర పరిశుభ్ర వాతావరణంలో జరిగేటట్లు సహకరించాలని సూచించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, వెల్ఫేర్, హెల్త్ కార్యదర్శులు పాల్గొన్నారు.